సాక్షి నల్లగొండ

ఆదివారం, 7, సెప్టెంబర్, 2025



హోటల్‌లో భారీ చోరీ

మిర్యాలగూడ పట్టణంలోని నాగార్జున సాగర్ రోడ్డులో గల వైష్టవీ గ్రాండ్ హోటల్‌లో భారీ చోరీ జరిగింది. - 8లో



బాలకృష్ణారెడ్డికి నివాళి

భువనగిరిలో శనివారం తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	589.80 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,02,074 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,02,074 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,296 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,108 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

స్థానిక సంస్థల ముసాయిదా జాబితాల ప్రకటన

నల్లగొండ : త్వరలో నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ప్రకటించారు. జిల్లాలోని అన్ని మండల పరిషత్, జిల్లా పరిషత్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై జాబితాలను ఉంచారు. మొత్తం 33 జెడ్పీటీసీలు, 353 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటి పరిధిలో గతంలో 1,925 పోలింగ్ స్టేషన్లు ఉండేవి.. ప్రస్తుతం ముసాయిదా జాబితాలో వాటిని 1,956కు పెంచారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన ఓటర్ల జాబితానే తీసుకుని స్థానిక సంస్థల ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించారు. దీని ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్లు 10,73,506 మంది ఉండగా అందులో పురుషులు 5,30,860 మంది, మహిళలు 5,42,589 మంది, ఇతరులు 57 మంది ఉన్నట్లు ముసాయిదాను ప్రకటించారు.

9న అప్రెంటిస్‌షిప్ మేళా

నల్లగొండ : నల్లగొండలోని ప్రభుత్వ ఐటీఐలో ఐటీఐ అభ్యర్థులకు ఈ నెల 9న అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీరాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్టుమెన్ సివిల్, మెషినిస్టు, స్టెనోగ్రఫీ, డ్రస్‌మేకింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు పూర్తి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఐటీఐ కాలేజీ వద్దకు హాజరు కావాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డీడీ చందనా సర్పే

పెద్దవూర : పదో తరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను శనివారం మున్ననూర్ ఐటీడీఏ పరిధిలోని అచ్చంపేటలో సన్మానించారు. పదవ తరగతి విద్యార్థులకు బోధించిన అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులను గిరిజన సంక్షేమ శాఖ డీడీ చందనా సర్పే, నాగర్‌కర్నూల్ జిల్లా డీటీడీఓ ఫిరంగి శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమోంటో, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఏసీఎంఓ డీ.వీ.నాయక్ పాల్గొన్నారు. సన్మానం పొందిన వారిలో పెద్దవూర పాఠశాల హెచ్‌ఎం డి.బాలోజీ, ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి రాంరెడ్డి, బి.కృష్ణ, ఎండీ.షబ్బీర్, సంధ్యా, శ్రీనునాయక్, షాహీన్‌బేగం ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు 85 మంది ఎంపిక

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాల్లో శనివారం నిర్వహించిన ఆలిండియా సివిల్ సర్వీస్ టోర్నమెంట్ (19 విభాగాల్లో) 135 మంది వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొనగా 85 మంది రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ఎండీ.అక్బర్‌అలీ తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 9 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు.

పది రోజుల్లో 12,740 దరఖాస్తులు

ఎన్‌ఎఫ్‌బీఎస్‌కు అనూహ్య స్పందన

- కలెక్టర్ చొరవతో పెద్ద ఎత్తున ముందుకొస్తున్న బాధిత కుటుంబాలు
- పథకం నిరంతరం అమల్లో ఉంటుందని ప్రకటన
- 6 వేల కుటుంబాలకు ఆర్థిక సాయం మంజూరు



చండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్‌ఎఫ్‌బీఎస్ దరఖాస్తులపై ఆరా తీస్తున్న కలెక్టర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జాతీయ కుటుంబ సంక్షేమ పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్) కింద ఆర్థిక సహాయం కోసం పది రోజుల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. పేద కుటుంబాలకు చెందిన ఇంటి పెద్ద ప్రమాదవశాత్తు, సహజంగా మరణించినా ఆ ఇంటికి రూ.20 వేల తక్షణ ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పెద్ద ఎత్తున అవగాహన కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో ప్రజల నుంచి అదేస్థాయిలో స్పందన వస్తోంది. జిల్లా యంత్రాంగం మొత్తాన్ని, ముఖ్యంగా మండల స్థాయి అధికారులను భాగస్వాములను చేయడంతో పాటు కలెక్టర్ స్వయంగా మండలాలతోపాటు డివిజన్ కేంద్రాల్లో ఈ పథకం అమలుపై సమీక్షలు నిర్వహించారు. దీంతో పది రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా 12,740 దరఖాస్తులు వచ్చాయి.

నల్లగొండ డివిజన్‌లో అధికంగా దరఖాస్తులు

గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన నిరుపేదలు ఈ పథకం కింద ప్రయోజనం పొందేందుకు ఆన్‌లైన్ తోపాటు ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీంతో ఒక్క నందికొండ మున్సిపాలిటీ మినహా ప్రతి మండలంలో 150కి పైగానే దరఖాస్తులు వచ్చాయి. డివిజన్ల వారీగా చూస్తే నల్లగొండ డివిజన్‌లోనే అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. నల్లగొండ డివిజన్ పరిధిలో ఈనెల 1వ తేదీ వరకే 4,306 దరఖాస్తులు రాగా, మిర్యాలగూడ డివిజన్‌లో 4,066 కుటుంబాలకు చెందిన పేదలు దరఖాస్తు చేసుకున్నారు. దేవరకొండ డివిజన్‌లో 2,737 మంది దరఖాస్తు చేసుకోగా, చండూరు డివిజన్‌లో 1,631 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా 12,740 దరఖాస్తులు రాగా, కొన్ని మండలాల్లో ఆరేడు వందల దరఖాస్తులు రావడం గమనార్హం.

ఇన్నాళ్లు అవగాహన కరువు

ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకంపై ప్రజల్లో అవగాహన లేక పోవడంతో ఇన్నాళ్లు ప్రజలు దరఖాస్తు చేసుకోలేక పోయారు. దీంతో కలెక్టర్ ప్రత్యేక కార్యక్రమంగా తీసుకొని ఈ పథకం అమలుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో 2017 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు 42 వేల మంది మరణించినట్లు జిల్లా యంత్రాంగం తమ వద్ద ఉన్న లెక్కల ప్రకారం తేల్చింది. అర్హులైన వారు తమ కుటుంబ పెద్ద చనిపోయినట్లు ఆధారాలతో దరఖాస్తు చేసుకునేలా కలెక్టర్ చర్యలు చేపట్టారు.

వెంటవెంటనే ప్రాసెసింగ్..

ఈ పథకం కోసం వస్తున్న దరఖాస్తులను వెంటవెంటనే ప్రాసెస్ చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ, తహసీల్దార్‌ను, ఉన్నతాధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల కార్యాలయాల్లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ప్రాసెస్ ఆర్‌డీఓకు పంపించాలని, అక్కడి నుంచి డీఆర్ఓ, తనకు పంపిస్తే నిబంధనల ప్రకారం ఉన్న వాటికి అప్రూవల్ ఇస్తామని స్పష్టం చేశారు.

ఆరు వేల కుటుంబాలకు మంజూరు

జిల్లాలో పేదల నుంచి వచ్చిన దరఖాస్తులను ప్రాసెస్ చేసి కలెక్టర్‌కు వచ్చిన దాదాపు ఆరు వేల అర్హులైన కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు కలెక్టర్ ఓకే చెప్పారు. అందులో ఇప్పటికే 2,723 మందికి ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా వారికి ఆర్థిక సహాయం అందించేందుకు కలెక్టర్ ప్రభుత్వానికి ఫైల్ పంపించారు. మరో సగానికిపైగా దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది.

దరఖాస్తుల స్వీకరణపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఎక్కువ దరఖాస్తులు స్వీకరించేలా అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం ఆమె వివిధ అంశాలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జాతీయ కుటుంబం ప్రయోజన పథకం కింద పేదరకు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేసిన ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఈ నెల 13న సన్మానిస్తామన్నారు. మున్సిపాలిటీల్లో దరఖాస్తుల సంఖ్య తక్కువగా ఉందని వాటిని పెంచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, ఆర్డీఓలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇది నిరంతర ప్రక్రియ

జాతీయ కుటుంబ సంక్షేమ పథకం నిరంతం కొనసాగుతుంది. పేద కుటుంబాలకు చెందిన ఇంటి పెద్ద మరణిస్తే ఆయా కుటుంబాలు తక్షణ సాయం కోసం ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటివరకు ఆరు వేల కుటుంబాలకు పథకాన్ని మంజూరు చేశాం. వచ్చే వారం రోజుల్లో దాదాపు 10 వేల కుటుంబాలకు మంజూరు చేసే అవకాశం ఉంది. ఈ పథకం అమలులో భాగంగా ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులతో ఈనెల 13వ తేదీన సెర్ప్ సీఈఓ సమావేశం కానున్నారు.

– కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎన్‌ఎఫ్‌బీఎస్‌కు వచ్చిన దరఖాస్తులు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	గట్టుప్పల్	163	నేరెడుగొమ్ము	194	వేములపల్లి	345
చండూరు	131	మర్రిగూడ	311	పీఏపల్లి	285	చిట్యాల	184
దేవరకొండ	210	మునుగోడు	430	అడవిదేవులపల్లి	180	కనగల్	333
హాలియా	183	నాంపల్లి	295	అనుముల	208	కట్టంగూర్	500
మిర్యాలగూడ	796	చందంపేట	330	దామరచర్ల	248	కేతేపల్లి	374
నందికొండ	60	చింతపల్లి	379	మాడుగులపల్లి	332	నకిరేకల్	304
చిట్యాల	153	దేవరకొండ	276	మిర్యాలగూడ	446	నల్లగొండ	187
నకిరేకల్	309	గుడిపల్లి	119	నిడమనూరు	280	నార్కట్‌పల్లి	362
నల్లగొండ	959	డిండి	559	పెద్దవూర	348	శాలిగౌరారం	364
మండలం	దరఖాస్తులు	గుర్రంపోడు	183	తిరుమలగిరిసాగర్	315	తిప్పర్తి	277
చండూరు	301	కొండమల్లేపల్లి	202	త్రిపురారం	305	మొత్తం	12,740



సాగర్ ఆరు గేట్లు ఎత్తివేత

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయం గరిష్టస్థాయికి చేరువకు రావడంతో శనివారం రాత్రి రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి ఎగువ నుంచి 1,02,074క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో ఆరు గేట్ల ద్వారా 48,474 విద్యుత్ ఉత్పాదనతో 33,292 క్యూసెక్కులు మొత్తం 81,766 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు.

కోమటిరెడ్డిని విమర్శిస్తే సహించం

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ : నల్లగొండ కోమటిరెడ్డి అడ్డా అని.. ఇక్కడి నుంచి ఐదు గెలిచారని.. అలాంటి నాయకుడిని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రిని వ్యక్తిగతంగా విమర్శిస్తే సహించేది లేదన్నారు. వినాయక శోభాయాత్ర సందర్భంగా 1వ వినాయక విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడితోపాటు మాజీ ఎమ్మెల్యే వ్యవహరించిన తీరుపై ఆయన మండిపడ్డారు. మంత్రి మాట్లాడుతుండగా బీజేపీ జిల్లా అధ్యక్షుడిని పిలువడంలేదనే అక్కసుతో అక్కడ ఘర్షణ వాతావరనం సృష్టించారని విమర్శించారు. రాజకీయ కనీస అవగాహన లేని బీజేపీ అధ్యక్షుడు ఇలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి అభివృద్ధే ధ్యేయంగా, పేదల సంక్షేమం కోసం 25 ఏళ్లుగా పని చేస్తున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కాంగ్రెస్ కార్యకర్తల చేత దాడులు చేయించుకుని.. గన్‌మెన్లను ఏర్పాటు చేయించుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు కత్తుల కోటి, కూసుకుంట్ల రాజిరెడ్డి, దుబ్బ రూప, బొజ్జ శంకర్, సురిగి వెంకన్నగౌడ్, మామిడి కార్తిక్, గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్‌రెడ్డి, ఇటికాల శ్రీనివాస్, పిల్లి యాదగిరియాదవ్, పాండు, సుజాత, స్వరూపారెడ్డి, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి

మళ్లీ రెవెన్యూ శాఖలోకి..

జీపీఓలుగా 276 మంది పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల నియామకం

- కౌన్సిలింగ్ ద్వారా క్లస్టర్ల కేటాయింపు
- సోమవారం విధుల్లో చేరాలని ఆదేశాలు



జీపీఓలకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : వీఆర్‌ఏలు, వీఆర్‌ఓలు తిరిగి రెవెన్యూ శాఖలోకి వచ్చారు. ప్రభుత్వం వారిని గ్రామపాలనాధికారులుగా (జీపీఓ) కొత్తగా నియమించింది. పరీక్షల్లో ఎంపికైన వారికి శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠి కౌన్సిలింగ్ నిర్వహించి క్లస్టర్లను కేటాయించారు.

275 క్లస్టర్లు.. 276 మంది ఎంపిక

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టులో వీఆర్‌ఓలను, ఆగస్టు 2023లో వీఆర్‌ఏల వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను రద్దు చేసి ఆ స్థానంలో భూభారతిని తీసుకొచ్చింది. ఆ సందర్భంలో రెవెన్యూ ఉద్యోగులను తిరిగి తీసుకొస్తామని చెప్పింది. ఇతర శాఖల్లో ఉన్న పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల్లో జీపీఓగా పని చేయాలనుకునే వారి నుంచి రెండు విడతలుగా దరఖాస్తులు తీసుకుంది. వారికి పరీక్షలు నిర్వహించింది. జిల్లాలో 275 క్లస్టర్లు ఉంటే 276 మంది జీపీఓలుగా ఎంపిక చేసింది.

కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్‌లు..

276 మంది జీపీఓలకు శనివారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో కౌన్సిలింగ్ ద్వారా క్లస్టర్లను కేటాయించారు. మొదట దరఖాస్తు చేసుకున్న వారికి మొదట పరీక్షలు నిర్వహించారు. పరీక్షలో పాసైన వారికి స్టేట్ ర్యాంకు కేటాయించారు. ఆ ర్యాంకు ప్రకారం మొదట కౌన్సిలింగ్‌లో వారికే అవకాశం కల్పించారు. రెండోసారి పరీక్ష రాసి పాసైన వారికి రెండో విడత కౌన్సిలింగ్‌లో అవకాశం కల్పించారు. జిల్లాలోని 275 రెవెన్యూ క్లస్టర్ల పరిధిలో ఉన్న గ్రామాల జాబితాను వారికి ఇచ్చి కౌన్సిలింగ్ నిర్వహించారు. పీహెచ్‌సీ, విడో, మెడికల్ గ్రౌండ్స్‌తో పాటు స్పౌజ్ ఉన్న వారికి ప్రత్యేక కేటగిరిలో పోస్టింగ్ ఇచ్చారు. వారికి సొంత మండలం గాకుండా పక్కన మండలంలో పోస్టింగ్ ఇచ్చారు. మిగతా వారికి సొంత నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వలేదు. మొత్తం 276 మంది ఎంపిక కాగా.. ఐదుగురు కౌన్సిలింగ్‌లో పోస్టింగ్ తీసుకోలేదు. వారు ప్రస్తుతం పని చేస్తున్న శాఖలోనే వెళ్తామని పేర్కొన్నారు. ఆ అంశం సీసీఎల్‌ఏ పరిధిలో ఉందని.. రిటర్న్ వెళ్లాలంటే సీసీఎల్‌ఏకు దరఖాస్తు చేసుకోవాలని కౌన్సిలింగ్ అధికారులు సూచించారు.

పారదర్శకంగా పోస్టింగ్‌లు ఇచ్చాం : కలెక్టర్

సీసీఎల్‌ఏ నిబంధనల ప్రకారం జీపీఓలకు వారి ర్యాంకులను బట్టి కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్ ఇచ్చామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ పోసింగ్‌లు పొందిన వారంతా విధుల్లో చేరాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పోస్టింగ్ ప్రాంతాలను కేటాయిస్తున్నందున పైరవీలు చేయవద్దన్నారు. అనంతరం కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్ పొందిన వారికి ఉత్తర్వులను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్ఓ అశోక్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.

జానపదంలో రాణిస్తున్న నల్లగొండ నాగదుర్గ

- చిన్ననాటి నుంచి కూచిపూడిలో శిక్షణ
- ఇప్పటి వరకు 300 వరకు జానపద పాటల్లో నటన
- యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా గుర్తింపు
- నల్లగొండలో కూచిపూడి నాట్యాలయం





కళ

చిన్ననాటి నుంచి ఆమెకు నృత్యంపై మక్కువ. యూకేజీ చదివే సమయంలోనే తల్లిదండ్రులు కూచిపూడి శిక్షణ ఇప్పించారు. ఆ నాటి నుంచి మొదలైన ఆమె డ్యాన్స్ ప్రయాణం తన అందం.. అభినయంతో నేడు వందల జానపద పాటల్లో రాణిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు పొందింది నల్లగొండ పట్టణానికి చెందిన గుత్తా నాగదుర్గ. అతి తక్కువ సమయంలోనే యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా గుర్తింపు పొంది యువతకు ఆదర్శంగా నిలుస్తున్న నాగదుర్గను శనివారం 'సాక్షి' పలకరించగా.. ఆమె తన కెరీర్‌కు సంబంధించిన విషయాలను పంచుకుంది. వివరాలు ఆమె మాటల్లోనే..

రామగిరి (నల్లగొండ) : మా స్వస్థలం ఉమ్మడి నల్లగొండ జిల్లా అడ్డగూడూరు. ఉద్యోగరీత్యా మా అమ్మానాన్న గుత్తా చలపతిరావు, వాసవి నల్లగొండలో స్థిరపడ్డారు. నేను పదో తరగతి వరకు నల్లగొండలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకున్నాను. హైదరాబాద్‌లో ఇంటర్, బీఏ జర్నలిజం పూర్తి చేశాను. ఆ తర్వాత పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో కూచిపూడిలో పీజీ చేశాను. మా అమ్మకు నాట్యం అంటే ఇష్టం. తను నేర్చుకోవాలకుంది. కానీ కుటుంబ పరిస్థితుల వల్ల కుదరలేదు. నేను చిన్ననాటి నుంచి డాన్స్ బాగా వేసే దాన్ని. అమ్మ గుర్తించి కూచిపూడి నేర్పించింది. పాలబిందెల బాలు మాస్టారు వద్ద కూచిపూడి నేర్చుకున్నాను. అనేక సందర్భాల్లో స్టేజ్ ప్రోగ్రాముల్లో కూచిపూడి నాట్యం చేశాను. అప్పుడు వచ్చిన ప్రశంసలు నాకు ప్రేరణ కలిగించాయి. నాట్యంతో పాటు సంగీతం కూడా నేర్చుకున్నాను. కానీ డాన్స్ పైనా ఎక్కువ శ్రద్ధ పెట్టాను. పేరిణి లాస్యంలో కూడా శిక్షణ తీసుకున్నాను. ప్రఖ్యాత కూచిపూడి కళాకారిణి మంజుభార్గవి వద్ద కూచిపూడి వర్క్‌షాపుకు హాజరయ్యాను. నల్లగొండకు చెందిన మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్ వద్ద రీ రికార్డింగ్‌లో పనిచేశాను. ఆ తర్వాత జానదప పాటల్లో నటించే అవకాశం లభించింది.

2021లో మొదటి అవకాశం

2021లో సై టీవీ రూపొందించిన 'తిన్నాతీరం పడతలే' అనే పాటలో మొదటిసారి నటించాను. ఆ పాటకు మంచి గుర్తింపు వచ్చింది. నాలుగు సంవత్సరాల్లో 300 వరకు జానపద పాటల్లో నటించాను. చాలా అవకాశాలు వస్తున్నా.. అందులో మంచివి మాత్రమే ఎంచుకుంటాను. ఫోక్ పాటలకు ప్రేక్షకుల్లో బాగా క్రేజ్ లభించింది. యూట్యూబ్‌లో 100 మిలియన్ బెంచ్ మార్క్‌కు చేరింది. శాస్త్రీయ నాట్యం నుంచి జానపదానికి వస్తానని అనుకోలేదు. అనుకోకుండా జానపద పాటల్లో ప్రారంభమైన నటన నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు తెచ్చింది. సినిమాల్లో నటించాలనేది నా కోరిక. ఇప్పుడిప్పుడే సినిమా అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం 'కలివి వనం' అనే సినిమాలో నటించాను. ఆ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



నాగదుర్గ నటించిన కలివి వనం సినిమా పోస్టర్

కూచిపూడిలో పీహెచ్‌డీ చేస్తా..

చిన్నప్పటి నుంచి కూచిపూడి నాట్యంలో శిక్షణ తీసుకున్నా. అనేక వర్క్‌షాపులకు హాజరయ్యా. డిప్లొమా కోర్సు కూడా పూర్తి చేశా. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో కూచిపూడిలో మాస్టర్స్ డిగ్రీ చదివాను. అయినప్పటికీ కూచిపూడిలో పరిశోధన చేసి పీహెచ్‌డీ చేయాలనేది నా లక్ష్యం. అంతే కాదు నేను నేర్చుకున్న విద్యను అందరికీ పంచాలని భావించాను. నల్లగొండలో మాకు సొంత ఇల్లు ఉంది. అవకాశాల కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాం. నేను నేర్చుకున్న కళ పది మందికి నేర్పించాలనేది నా కోరిక. నల్లగొండలో నాగదుర్గ నాట్యాలయం పేరుతో కూచిపూడి శిక్షణ కేంద్రం నడిపిస్తున్నా. 60 మంది వరకు విద్యార్థులు శిక్షణకు వస్తున్నారు. షూటింగ్‌లో ఎంత బిజీగా ఉన్నా.. ప్రతి శని, ఆదివారం నల్లగొండకు వస్తాం.



సినీ సన్నివేశంలో నాగదుర్గ

జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలి

- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీం అక్తర్

రామగిరి(నల్లగొండ) : చిన్నారులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీం అక్తర్ అన్నారు. శనివారం ఆయన నల్లగొండ సమీపంలోని పానగల్ చారుమతి ఛైల్డ్‌కేర్ సెంటర్‌ను ఆయన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితం ఘర్షణలతో కూడుకొని ఉంటుందని, ప్రతి ఒక్కరు కష్టపడి చదివితేనే ముందుకు వెళ్తారని పేర్కొన్నారు. గొప్పవారు కావాలనే పట్టుదల, సంకల్పంతో చదువుకోవాలని.. ఎవరి భవిష్యత్ వారి చేతుల్లోనే ఉంటుందన్నారు. దాతల సహకారంతో చారుమతి ఛైల్డ్ కేర్ సెంటర్‌ను నడిపిస్తున్న నాగసేనారెడ్డిని అభినందించారు. ఈ కేంద్రం ద్వారా 500 మందిని చదివించడం, 43 మంది అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఛైల్డ్‌కేర్ సెంటర్‌లో పని చేస్తున్న వారిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కృష్ణ, కృష్ణవేణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి, కట్ట వెంకటరెడ్డి, వెంకన్న, గణేష్, నిర్మల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ షమీం అక్తర్

క్లుప్తంగా

వినాయకుడి పూజకు వెళ్లొచ్చేలోగా ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

ఆత్మకూరు(ఎం): వినాయకుడి వద్దకు పూజకు వెళ్లి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన గుండెగాని మల్లయ్య ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి వినాయకుడి వద్ద పూజలు చేయడానికి వెళ్లారు. పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో బీరువా పరిశీలించి చూడగా.. అందులోని రూ. 50వేల నగదు కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సాయంతో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

డిండి: బతుకుదెరువు కోసం ప్రాజెక్టులోకి చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం డిండి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి పట్టణానికి చెందిన మేకల మల్లయ్య(45) చేపల వేటనే జీవనాధారంగా చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగా చేపలు పట్టేందుకు డిండి ప్రాజెక్టు లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో వల వేస్తున్న సమయంలో ప్రాజెక్టులో వచ్చిన అలలకు తాను కూర్చున్న థర్మకోల్ ప్యాడ్ (తెప్ప దిండు) పై నంచి ప్రమాదవశాత్తు మల్లయ్య నీటిలో పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల మత్స్యకారులు ఘటనా స్థలానికి చేరుకొని నీటిలోంచి బయటకు తీసేలోపే మల్లయ్య మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రాజెక్టు వద్దకు చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సుల్తానీ ఇచ్చిన ఫిర్మాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

నిరసనల నడుమ గణేష్ శోభాయాత్ర

- డీజే తొలగించినందుకు పోలీసులతో మండపాల నిర్వాహకుల వాగ్వాదం
- భజనలు చేయకుండా అడ్డుకుంటున్నారని ధర్నాకు దిగిన ఉత్సవ సమితి నాయకులు



భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న వినాయక మండపాల నిర్వాహకులు

భువనగిరి: భువనగిరి పట్టణంలో జరిగిన గణేష్ శోభాయాత్ర నిరసనలు, ధర్నాల నడుమ కొనసాగింది. పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిన్న విగ్రహాలను పెద్ద చెరువులో నిమజ్జనం చేసేందుకు తరలించారు. మరికొన్ని భారీ విగ్రహాలను సాయంత్రం తర్వాత కదిలించడం ప్రారంభించారు. ఈక్రమంలో తాతానగర్‌లో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీజేకి అనుమతి లేదని పోలీసులు దానిని తొలగించారు. సింగిల్ పిన్ డీజేకు ముందుగానే అనుమతించి ఇప్పుడు లేదని చెప్పడం సరికాదని మండప నిర్వాహకులు స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద ధర్నాకు దిగారు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి.

లాఠీచార్జ్ చేయడంతో..

సాధారణంగా భువనగిరి పట్టణంలో వినాయక శోభాయాత్ర సమ్మద్ చౌరస్తా మీదుగా కొనసాగుతుంది. ఈ క్రమంలో వినాయక విగ్రహాలకు సమ్మద్ చౌరస్తాకు చేరుకున్న తర్వాత కొద్ది సమయం అక్కడ భజన చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలో శనివారం తెల్లవారుజామున మండపాల నిర్వాహకులు భజన చేస్తున్న క్రమంలో పోలీసులు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని భజనలు చేయకుండా వెళ్లిపోవాలని సూచించారు. కొద్దిసేపు భజన చేసి వెళ్తామని చెప్పి భజనలు చేస్తుండగా పోలీసులు వారిని ముందుకు తోశారు. దీంతో మండపాల నిర్వాహకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు లాఠీచార్జ్ చేశారు. దీంతో మండపాల నిర్వాహకులు అక్కడే నిరసన తెలిపారు. అనంతరం లాఠీచార్జ్‌ను నిరసిస్తూ భువనగిరి గణేష్ ఉత్సవ సమితితో కలిసి నిర్వాహకులు ప్రిన్స్ చౌరస్తా వద్ద రోడ్డుపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న అడిషనల్ డీసీపీ, పట్టణ సీఐ అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి సర్ది చెప్పడంతో ధర్నా విరమించారు. పట్టణ సీఐ రమేష్‌ను వివరణ కోరగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందనే ఉద్దేశంతో మాత్రమే వారిని ముందుకు వెళ్లాలని సూచించినట్లు చెప్పారు.

కానిస్టేబుల్‌పై దాడి

కోదాడరూరల్ : వినాయక శోభాయాత్రలో కొందరు అల్లరిమూకలు కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారు. కోదాడ పట్టణంలోని అనంతగిరి రోడ్డులో ఉన్న పెద్ద చెరువులో గణనాథులను నిమజ్జనం చేసేందుకు విగ్రహాలను తరలిస్తున్నారు. ఈ క్రమంలో అనంతగిరి రోడ్డులో కొంతమంది అల్లరిమూకలు గొడవపడుతున్నారు. కానిస్టేబుల్ నరేష్ గొడవను ఆపేందుకు ప్రయత్నించారు. మద్యం మత్తులో ఉన్న అల్లరిమూకలు కానిస్టేబుల్ తలపై ఐరన్‌రాడ్డుతో దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, సిబ్బంది అతడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకొని గాయపడిన కానిస్టేబుల్‌ను పరామర్శించారు. దాడి చేసిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



గాయపడిన కానిస్టేబుల్

జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళి



బీబీనగర్ : జిట్టా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల, జిట్టా సతీమణి సునీత, నాయకులు

భువనగిరి : పట్టణ కేంద్రం తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం రైతు బజార్ ఎదుట అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకరమంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారులు చెరుకు సుధాకర్, కుటుంబ సభ్యులు సునిత, వివేకానంద, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ కో ఆర్డినేటర్ కోల్పుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్లు అంజనేయులు, వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్, నాయకులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జనగాం పాండు, ర్యాకల శ్రీనివాస్, నువ్వుల సత్యనారాయణ, గోమారి సుధాకర్‌రెడ్డి, చిలుగూరి సత్తిరెడ్డి, రత్నపురం శ్రీనివాస్, నవీన్, మదు తదితరులు పాల్గొన్నారు.

జిట్టా పోరాటం మరువలేనిది

బీబీనగర్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో దివంగత జిట్టా బాలకృష్ణారెడ్డి చేసిన పోరాటం మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి కొనియాడారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని జిట్టా విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిట్టా సునిత , నాయకులు పింగళ్‌రెడ్డి, శ్యామ్‌గౌడ్, లక్ష్మినారాయణ, నరేందర్‌రెడ్డి, బాలకృష్ణ, సుదర్శన్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

హోటల్‌లో భారీ చోరీ

- రూ.80 లక్షలు దోచుకెళ్లిన దుండగులు



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌రోడ్డులో గల వైష్ణవీ గ్రాండ్ హోటల్‌లో భారీ చోరీ జరిగింది. వన్‌టౌన్ సీఐ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం.. హోటల్ నిర్వాహకుడు రావిరాల రవికుమార్ రోజుమాదిరిగా శుక్రవారం రాత్రి తన చాంబర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి ఒంటి గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చాంబర్ తలుపునకు ఉన్న తాళం పగులకొట్టాడు. గదిలోని కౌంటర్‌ను బద్దలుకొట్టి అందులో దాచిన రూ.80లక్షలను అపహరించాడు. మరుసటి రోజు ఉదయం చాంబర్ తలుపు తాళం పగులకొట్టి ఉండటాన్ని గమనించిన సిబ్బంది నిర్వాహకులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐలు నాగభూషణం, పీఎస్‌డీ ప్రసాద్ చోరీ జరిగిన తీరును పరిశీలించారు. డీఎస్పీ రాజశేఖరరాజు హోటల్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. నల్లగొండ నుంచి క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు. సీసీ పుటేజీని పరిశీలిస్తున్నామని అందులో ఒక వ్యక్తి వచ్చి బ్యాగ్‌తో వెళ్లిన దృశ్యాలు కనిపించాయని డీఎస్పీ తెలిపారు. క్లూస్ టీం ఆధారాలు, సీసీ పుటేజీ, టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. హోటల్ నిర్వాహకుడు రావిరాల రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ నాగభూషణం తెలిపారు.

గూడ్స్ వాహనాన్ని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

చిట్యాల: చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఏలూరు జిల్లా, పెద్దదేవి మండలం, గంగన్నగూడెం గ్రామానికి చెందిన నలుగురు హైదరాబాద్‌కు టాటా ఏస్ గూడ్స్ వాహనంలో వెళ్తున్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులోకి రాగానే అక్కడే మరమ్మతులకు గురైన లారీ రహదారిపైనే నిలిపి ఉంచడంతో దాని వెంట టాటా ఏస్ వాహనాన్ని కూడా నిలిపాడు. ఈక్రమంలో అతివేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు టాటా ఏస్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో టాటా ఏస్‌లో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వారిలో నార్ల భానుప్రసాద్(50) అనే వ్యక్తి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మిగతా ముగ్గురు క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

హాలియా : చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రాజశేఖర రాజు తెలిపారు. కేసు వివరాలను శనివారం హాలియా సర్కిల్ కార్యాలయంలో ఆయన వెల్లడించారు. పెద్దవూర మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన కల్లూరి బ్రహ్మారెడ్డి అలియాస్ (చింటు), అదే గ్రామానికి చెందిన మూల మాధవరెడ్డి కలిసి ఆగస్టు 27న అనుముల మండలంలోని శ్రీనాథ పురం స్టేజీ నుంచి అదే గ్రామం వైపు నడుచుకుంటూ వెళ్తున్న బొమ్మెరబోయిన ముత్తమ్మ మెడలో బంగారు పుస్తెల తాడు లాక్కొని పరారయ్యారు. ఈ విషయంపై బాధిత మహిళ హాలియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టారు. అనుముల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ సమీపంలోని బాలాజీ రైస్ మిల్లు వద్ద ఇద్దరు నిందితులు అనుమానాస్పదంగా కనిపించారు. హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ సిబ్బందితో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి 3 తులాల బంగారం పుస్తెల తాడు, రెండు సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు కల్లూరి బ్రహ్మారెడ్డి, మూల మాధవరెడ్డిని శనివారం రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి: రైలు కిందపడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5న రాత్రి సమయంలో భువనగిరి మండలంలోని పగిడిపల్లి, భువనగిరి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి గాయాలకు గురయ్యాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అదే రోజు ఉదయం 10.45 గంటలకు మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని, నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ కోసం 98482 22169ను సంప్రదించాలని భువనగిరి రైల్వే పోలీస్ ఇన్‌చార్జ్ కృష్ణారావు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి భూసర్వే

నిడమనూరు : సాగర్ నియోజకవర్గానికి ప్రభుత్వం కేటాయించిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి డివిజన్ సర్వేయర్ ఆధ్వర్యంలో శనివారం భూ సర్వే నిర్వహించారు. నిడమనూరు మండలంలోని ఊట్కూరులోని సర్వే నంబరు 358, 361 ప్రభుత్వ భూమిని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య ఆధ్వర్యంలో డివిజన్ సర్వేయర్ విజయ్ సర్వే నిర్వహించారు.



భూసర్వే చేస్తున్న అధికారులు

సాగర్ కాల్వలో గల్లంతైన వారిలో తండ్రి మృతదేహం లభ్యం

వేములపల్లి: గణేష్ నిమజ్జనానికి వచ్చి వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వలో తండ్రి, కుమారుడు గల్లంతైన ఘటనలో తండ్రి సాంబయ్య మృతదేహం శనివారం సాయంత్రం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన తండ్రి, కుమారుడు పున్నా సాంబయ్య, శివమణిలు శుక్రవారం వేములపల్లి సాగర్ ఎడమకాల్వలో గల్లంతయ్యారు. పోలీసులు సాగర్ ఎడమకాల్వ వెంట రెండు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టగా శనివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం గ్రామ శివారులో సాంబయ్య మృతదేహం లభ్యమైనట్లు ఎస్పై తెలిపారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కుమారుడు శివమణి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

జూదరులపై కేసు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురం రెవెన్యూ పరిధిలో గల గెస్ట్ హౌజ్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో శనివారం పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురం గ్రామానికి చెందిన నక్క శ్రీనివాస్‌రెడ్డి తన గెస్ట్‌హౌజ్‌లో అదే గ్రామానికి చెందిన పి.జంగయ్య, ఉపేందర్‌తో పాటు పోచంపల్లికి చెందిన చెక్క నరేశ్, సుధాకర్‌రెడ్డి, మహేందర్, ప్రశాంత్ అనే యువకులు కలిసి పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వారి వద్ద రూ.25,570 నగదు, 7 మొబైల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్ట్

హుజూర్‌నగర్ : నకిలీ పత్రాలతో ఇసుక రవాణా చేస్తున్న లారీ డ్రైవర్, ఓనర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన శనివారం హుజూర్ నగర్‌లో చోటు చేసుకుంది. సీఐ చరమందరాజు, ఎస్ఐ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన లంకెల శ్రీనివాస్ రెడ్డి, డ్రైవర్ రాంబాబు నకిలీ పత్రాలతో ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీలోని నందిగామ మండలం ఐతవరం గ్రామం నుంచి హుజూర్‌నగర్ మండలం వేపల సింగారం గ్రామానికి ఇసుక రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నకిలీ స్టాంపులు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మోహన్ బాబు తెలిపారు.

మూడేళ్లుగా మూలకు..

- పంపిణీ చేయకుండా పంచాయతీ కార్యాలయంలో పడేసిన బతుకమ్మ చీరలు



కోదాడ: మూడేళ్ల క్రితం బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ పర్వదినం సందర్భంగా మహిళలకు పంపిణీ చేసేందుకు పంపించిన దాదాపు మూడు వేల చీరలు సూర్యాపేట జిల్లా కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని తమ్మర పంచాయతీ కార్యాలయంలో మూలన పడేశారు. తమ్మర పంచాయతీ కోదాడ మున్సిపాలిటీలో కలిసిన తరువాత నాలుగు గదులతో ఉన్న పంచాయతీ భవనంలో ఒక గదిలో పోస్టాఫీస్, మరొక గదిలో హెల్త్ సెంటర్ నిర్వహిస్తుండగా.. మరొక గదిలో మున్సిపాలిటీ సామగ్రి వేశారు. మిగిలిన గదిలో ఈ బతుకమ్మ చీరలు పడేశారు. ఈ చీరలను వచ్చే బతుకమ్మ పండుగకు అయినా పేద మహిళలకు పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- కిలో నలభై గ్రాముల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర రాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: గంజాయి సేవించడంతోపాటు, చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి స్థానిక యువకులకు విక్రయిస్తున్న ఐదుగురిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం డీఎస్పీ రాజశేఖర రాజు నిందితుల వివరాలు వెల్లడించారు. రైస్‌మిల్లులో పని చేసేందుకు బిహార్ రాష్ట్రం నుంచి సొగంధ్ కుమార్ సింగ్, కరణ్ కుమార్ అనే ఇద్దరు యువకులు మిర్యాలగూడకు వచ్చారు. వీరు తమ రాష్ట్రానికి వెళ్లి వచ్చే సమయంలో వారి వెంట గంజాయిని తీసుకొచ్చి రైస్ మిల్లుల్లో పని చేసే మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కుక్కల వంశీ, దైద జగదీష్, తాళ్లగడ్డకు చెందిన షేక్ హైమాద్, చైతన్యనగర్ కు చెందిన జంపాల నిఖిల్‌కు అలవాటు చేశారు. వీరు గంజాయిని సేవించడంతో పాటు బయట వ్యక్తులకు విక్రయిస్తే డబ్బులు సంపాదించవచ్చని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అమ్మడం మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు వారిపై నిఘా పెట్టారు. శనివారం రోజు మాదిరిగా గంజాయిని విక్రయించేందుకు పట్టణ శివారు ప్రాంతమైన రాంనగర్ బంధం శ్రీ హనుమాన్ వెంచర్ కు వెళ్లగా.. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1.40 కిలోల గంజాయితో పాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ నాగభూషణం, ఎస్ఐ సైదిరెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీను, నర్సింహ, బూర వీరబాబు, సంధ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలి

- గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రటరీ శ్యాంప్రసాద్ లాల్



రికార్డులు పరిశీలిస్తున్న శ్యాం ప్రసాద్‌లాల్

నాగార్జునసాగర్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రటరీ శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. శనివారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల బీసీ గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు పట్టిక, తరగతి గదులు, వంటగదిని పరిశీలించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు అందిస్తుందని తెలిపారు. పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు నిరంతరం పాటుపడాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రవికుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, ఏటీపీ సంతోష్, సరిత తదితరులున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

కట్టంగూర్: భర్త మద్యానికి బానిస కావడంతో జీవితంపై విరక్తి చెందిన భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కట్టంగూర్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి చెందిన పోలగోని యాదయ్య చిన్న కుమార్తె లక్ష్మి(35)ని 16 సంవత్సరాల క్రితం కట్టంగూర్‌కు చెందిన పెద్ది యాదయ్య పెద్ద కుమారుడు సైదులుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్ని రోజులుగా లక్ష్మి భర్త సైదులు మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. మద్యం మానేసి, కుటుంబాన్ని పోషించుకోవాలని సైదులుకు పెద్ద మనుషులతో చెప్పించినా మారలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప రాడ్డుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త చుట్టు పక్కల వారి సాయంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. శనివారం మృతురాలి తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపారు.

గీతకార్మికుడి నరకయాతన

- తాటిచెట్టు ఎక్కే క్రమంలో జారిన మోకు
- చెట్టు మధ్యలోనే కదలకుండా ఉండిపోయిన కార్మికుడు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని జనగాం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొండూరి చంద్రయ్య అనే గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కే క్రమంలో మోకు బిగుసుకుపోవడంతో చెట్టు సగం వరకు జారి మధ్యలోనే కదలకుండా ఉండిపోయాడు. గమనించిన తోటి గీత కార్మికులు కొండూరి యాదయ్య, తొలుపూరి ఇస్తారి చెట్టు ఎక్కి దించేందుకు ప్రయత్నించగా.. వీలు కాలేదు. అంతలోని మరో ఇద్దరు గీత కార్మికులు కందుల లింగస్వామి, కొండూరి కృష్ణయ్య సాయంతో చెట్టు ఎక్కి చంద్రయ్యను క్షేమంగా కిందకు దించారు.



కార్మికుడిని చెట్టుపై నుంచి కిందకు దింపుతున్న తోటి గీత కార్మికులు

జలనారాయణ స్వామికి మంగళహారతి

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో గల వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం జల నారాయణ స్వామికి మంగళహారతులు సమర్పించారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి సుప్రభాతసేవ, నిత్య కల్యాణ మహోత్సవం, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు.

నేడు స్వర్ణగిరి ఆలయం మూసివేత

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం మూసివేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణ్ ఆచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు మూసివేసి తిరిగి సోమవారం ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, సంప్రోక్షణ కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆలయం తెరవనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం 2.30 గంటల వరకు ఆలయంలో అన్ని రకాల ఆర్జిత సేవలు, దర్శనాలు నిలిపివేయనున్నట్లు తెలిపారు.



జలనారాయణ స్వామికి మంగళహారతి సమర్పిస్తున్న అర్చకులు